ప్రజాశక్తి

గురువారం 23 జనవరి 2025

5

అల్లూరి సీతారామరాజు



అరకు ఉత్సవాలు రద్దు చేయాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 3 వరకు అరకులో ప్రభుత్వం నిర్వహించ నున్న ఉత్సవాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు కించుమండ వారపు సంతలో ఆందోళన చేశారు. గిరిజన గ్రామాల్లో తాగు నీరు, రోడ్డు వంటి సమస్యలతో గిరిజనులు ఇబ్బంది పడుతుంటే వాటిని పరిష్కారం చేయాల్సింది పోయి ఉత్సవాలు పేరిట ప్రజధనాన్ని వృథా చేయడం సరికాదని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పి చిన్నస్వామి ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న కాంగ్రెస్ నాయకులు

అరకులో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు కృషి

- ఎంపీ తనుజారాణి -అరకువ్యాలీలో పాస్ పోర్ట్ సేవా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని అరకు ఎంపీ గుమ్మ తనుజరాణి అన్నారు.అరకులోయ పోస్ట్ ఆఫీస్ సముదాయంలో బుధవారం పాస్ పోర్ట్ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అరకులోయ దిన దినం అభివృద్ధి చెందుతుందని, గతంలో మామూలు రోడ్డు ఉండేదని ఇప్పుడు హైవే రోడ్డు వచ్చిందన్నారు. అలాగే డబల్ రైల్వే ట్రాక్ వచ్చిందని ఆమె అన్నారు. పాస్ పోర్ట్ కోసం సుదూర ప్రాంతమైన విశాఖపట్నంకి వెళ్లే వారమని, ఇప్పుడు అరకులోనే అందుబాటులోకి పాస్ పోర్ట్ కేంద్రం రావడం హర్షణీయమన్నారు. అరకులోయకు దేశ విదేశాల పర్యాటకులు ఇక్కడికి సందర్శిస్తున్న దృష్ట్యా భవిష్యత్తులో అరకులోయలో ఎయిర్ పోర్ట్ కూడా అవసరం ఉందని, ఇందుకు ఎంపీగా తాను తన వంతు కృషి చేస్తానన్నారు.పాస్ పోర్ట్ సేవ కేంద్రాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ, గతంలో పాస్ పోర్ట్ పొందడానికి సుదూర ప్రాంతాలకు వెళ్లి అనేక అవస్థలు పడేవారని, ఇప్పుడు మన ముంగిట రావడం ఆనందదాయక మన్నారు.

రీజనల్ పాస్పోర్ట్ అధికారి కె.ఎస్ భాస్కరరావు మాట్లాడుతూ, అరకులో రోజుకు 40 స్లాట్ బుకింగ్ కు అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో స్లాట్ బుకింగ్ పెంచుకునే అవకాశం కూడా ఉందన్నారు. పాస్ పోర్ట్ పొందడానికి ఏజెంట్లను ఆశ్రయించవద్దని ఆయన కోరారు. అరకు సేవా కేంద్రంలో సులభతరంగా పాస్ పోర్ట్ పొందవచ్చు అన్నారు.విశాఖపట్నం పోస్ట్ మాస్టర్ జనరల్ విన్నం ఉపేంద్ర మాట్లాడుతూ, అరకులో పాస్ పోర్ట్ సేవ కేంద్రం ఏర్పాటు చేయడం అపూర్వమైన ఘట్టమన్నారు.పాస్ పోర్ట్ జాయింట్ సెక్రటరీ కేజే శ్రీనివాస్ మాట్లాడుతూ, అరుకు ప్రాంత ప్రజలు పాస్పోర్ట్ సేవా కేంద్రం సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.అనంతరం పలువురికి పాస్ పోర్ట్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, అనకాపల్లి పోస్టల్ ఎస్పీ నాగేశ్వరరెడ్డి, పాస్పోర్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ కె.వి. డి.సాగర్, తహసిల్దారు ఎం. వి.వి.ప్రసాద్, అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి, పెద్దలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, పోస్టల్ ఐపివోలు లక్ష్మి కిషోర్, ఉపేందర్, ప్రముఖ వ్యాపారవేత మయూరి రాజారావు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎంపీ తనుజారాణి



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, చిత్రంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ

పోలవరం నిర్వాసితులకు ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-దేవీపట్నం

దేవీపట్నం మండలం ఇందుకూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద పోలవరం నిర్వాసితులతో బుధవారం జరిగిన సమావేశంలో 107 మంది నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవీ భాస్కర్ పంపిణీ చేశారు. ముందుగా రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్.కల్పశ్రీ నిర్వాసితులకు వివరాలు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే శిరీషాదేవి, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు మఠం విజయభాస్కర్ తదితరులు ఇళ్ల పట్టాలను నిర్వాసితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ద్వారానే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇటీవలే పోలవరం నిర్వాసితుల కుటుంబాలకు సుమారు రూ.815 కోట్లు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ విడుదల చేసినట్లు గుర్తు చేశారు. దేవీపట్నం మండలం తాళ్లూరు గ్రామానికి చెందిన 74 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇందులో గత ఐదు సంవత్సరాల్లో భర్తలు చనిపోయిన 33 మందికి కూడా పట్టాలు కూటమి ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మరిచెట్ల బుజ్జిబాబు, బిజెపి అధ్యక్షులు కారం రామన్న దొర, జనసేన అధ్యక్షులు చారపు రాయుడు, సర్పంచ్ కుంజం రాజమణి, కట్టుమూరి వీరబాబు, మాగపు బాబురావు, గోళ్ళ చంటిబాబు, శివరామకృష్ణ, గంగాధర్, నాగేశ్వరరావు, పోసమ్మ, నాగేశ్వరి, చిన్ని, కేశవరపు పండు, మల్లేష్, అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

పిఎం జన్మన్ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

-సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న పిఎం జన్మన్ ఇల్లు నిర్మాణానికి 5 లక్షలు పెంచాలని సిపిఎం ఆధ్వర్యాన అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనం నుండి తహశీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులు, గిరిజనులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సంధర్బంగా తహశీల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం గిరిజన ప్రాంతంలో నివసిస్తున్న నిరుపేద పివిటిజి కుటుంబాలకు పీఎం జన్మన్ వికాస్ యోజన పథకం కింద మంజూరు చేస్తున్న 2 లక్ష 39 వేలు ఎటు చాలవన్నారు. ప్రస్తుతం పెరిగిన ధరలు సిమెంట్, ఐరన్, సిమెంట్, ఇసుక ధరలు భారీగా పెరగడంతో కేంద్రం ఇస్తున్న డబ్బులు ఏ మూలకు సరిపోవని తెలిపారు. ప్రతి ఇల్లు నిర్మాణానికి యూనిట్ కాస్ట్ 5 లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీఎం జన్మన్ పథకం వ్యయం పెంచకపోతే మొండి గోడలకే పరిమితం అవుతాయని చెప్పారు.నిరుపేద పీవీటిజికు ఇల్లు నిర్మాణానికి 5 లక్షలు పెంచి పేదవాడి సొంతింటి కల నెరవేర్చి ఆర్థికంగా తోడ్పడాలన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

సిఐటియు ఆధ్వర్యాన పారిశుధ్య కార్మికుల వినతి

ప్రజాశక్తి-పాడేరు: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కొత్త జీవో ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం 26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికుల సమస్యలపై బుధవారం స్థానిక ప్రభుత్వ జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్రకు సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాడేరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, అరకు, చింతపల్లి, ముంచంగిపుట్టు ఏరియా ఆసుపత్రిలో గత 20 సంవత్సరాల పైబడి పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 2019సంవత్సరంలో 16 వేల జీతాలు చెల్లిస్తామని జీవో జారీ చేసినప్పటికీ పారిశుధ్య కార్మికులకు గరిష్టంగా 11,200 మాత్రమే వేతనాలు మాత్రమే అందుతున్నాయన్నారు.నెలలు తరబడి జీతాలు అందక, పీఎఫ్, ఈఎస్ఐలు కార్మికుల నుండి వసూలు చేసినప్పటికీ కాంట్రాక్టర్ పీఎఫ్, ఈఎస్ఐ సొమ్ము సక్రమంగా జమ చేయలేదన్నారు. కాంట్రాక్టు విధానం రద్దు చేసి డెరెక్టర్ అఫ్ మెడికల్ ద్వారా జీతాలు చెల్లించాలన్నారు. పాడేరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో 420 పడకలకు 60 మంది పారిశుధ్య కార్మికులు ఉండవలసి ఉన్నా కేవలం 47మంది తోనే పని చేయిస్తున్నారన్నారు. కొత్త ప్రభుత్వం తమ సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. పాడేరు గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రిలో 420, అరకు ముంచంగిపుట్టు, చింతపల్లి ఆసుపత్రి లో పడకల కు సరిపడ్డ సిబ్బంది నియామకం చేపట్టాలన్నారు. ప్రతి నెలా మొదటి వారంలో జీతాలు చెల్లించాలని, యూనిఫామ్ సక్రమంగా పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు .ముత్యాలమ్మ, ఘాటీ, రాజేశ్వరి, సింహాచలం, నగేష్, చిట్టిబాబు పాల్గొన్నారు....




విన్నతి పత్రాన్ని అందజేస్తున్న పారిశుధ్యకార్మికులు

ఉపాధి హామీతో గ్రామాలాభివృద్ధి

ప్రజాశక్తి -రావికమతం:

ఉపాధి హామీ పనులతో గ్రామ ప్రజలకు ఉపాధి దొరకడమే కాకుండా గ్రామాభివృద్ధికి కూడా ఎంతో దోహద పడుతుందని మరుపాక ఎంపీటీసీ ముచ్చ సూర్యనారాయణ అన్నారు. మండలంలో మరుపాక గ్రామంలో బుధవారం చెరువు పూడిక తీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాట్లాడుతూ, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.గ్రామంలో ఉన్న ఎలగబంధ చెరువు పూడికతీతకు 10 లక్షల రూపాయలు ఉపాధి హామీ నిధులు మంజూరయ్యాయన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాంబాబు, మాజీ మోడల్ స్కూల్ కమిటీ చైర్మన్ సత్తిబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



మంగ చైతన్యను సత్కరిస్తున్న సిపిఎం నేతలు

ఉన్నత శిఖరాలకు ఎదగాలి

ప్రజాశక్తి-కూనవరం : ఆర్చరీ బాటిల్ డిసైన్ కోడింగ్‌లో ప్రతిభ కనబర్చిన మండలంలోని కొండాయి గూడెం గ్రామానికి చెందిన కారం మంగ చైతన్యను బుధవారం సీపీఎం నాయకులు అభినందించారు. మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న మంగ చైతన్య కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా యాజమాన్యం చొరవతో గతేడాది దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ సెమినార్‌లో తన సత్తా చాటింది. ఆర్చరీ బాటిల్ అనే అంశంపై డిసైన్ కోడింగ్ చేసి అక్కడున్న నిర్వాహకులు, అధికారులను ఆకట్టుకుంది. ఇంతటి అద్భుత కనబర్చిన మంగ చైతన్య సెలవులకు వచ్చిన సందర్భంగా ఆమెను సీపీఎం నాయకులు సత్కరించారు. భవిష్యత్‌లో మరింత ప్రతిభతో ఉన్నత శిఖరాలకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ ప్రతిభ కారణమైన తల్లిదండ్రులు, స్కూల్ టీచర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, ఎంపీటీసీ జయసుధ, నాయకులు కర్నాటి శ్రీనివాసరావు, ఆవుల మురళి, ఉపేంద్ర, తాళ్లూరి శ్రీనివాసరావు, పొద్దయ్య, బాబురావు, ముత్తయ్య, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : పర్యాటక ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు అసౌకర్యం కలగ కుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ రీమల గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పర్యటక ప్రాంతాలు ఆహ్లాదకర వాతావరణం కలిగి ఉన్నాయని, పర్యాటక ప్రాంతాలు లంబసింగి, కొత్తపల్లి జలపాతం, వనజంగి, డల్లాపల్లి, చాపరాయి, అరకు ట్రైబల్ మ్యూజియం, కటిక జలపాతం, బొర్రా గుహాలు, కొయ్యూరు మండలంలో గాదిగుమ్మి చింతవాణి పాలెం జలపాతాలు వంటి అనేక పర్యాటక ప్రాంతాల సందర్శనకు వివిధ ప్రాంతాల నుండి అనేక మంది కుటుంబ సమేతంగా, పిల్లలతో సహా వస్తున్నారని తెలిపారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఆ ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్‌కు రుసుము తీసుకుంటున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పార్కింగ్‌కి స్థలాలు కేటాయించాలని కోరారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ మండలంలోని బుధవారం జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ సోషల్ ఆడిట్ సమావేశం అనంతరం ఉపాధి హామీ కూలీలకు పరికరాలు పంపిణీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో డ్వామా పీడీకి వినతి పత్రాన్ని అందజేశారు. గిరిజన ప్రాంతంలో ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, గత ఎనిమిది ఏళ్లుగా కూలీలకు ఇస్తున్న పని పరికరాలు గునపం, పారా, తట్ట, మెడికల్ కిట్స్ ఇవ్వలేదని చెప్పారు.పని ప్రదేశంలో ఎండకు టెంటు సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.గిరిజన ప్రాంతంలో ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి కొండ పోడు పట్టాతో సంబంధం లేకుండా 200 రోజులు పని దినాలు కల్పించాలని,రోజుకు కనీస వేతనం 600 రూపాయలు కూలీ ఇవ్వాలన్నారు.గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు, కె రామారావు పాల్గొన్నారు.



విన్నతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న గిరిజన మహిళలు

రోడ్డు నిర్మాణం చేపట్టరూ...

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : మండల పరిధిలో కుమడ గ్రామపంచాయతీకి చెందిన గుడ్ర మెట్ట గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని వార్డ్ మెంబర్ మఠం రాజేశ్వరి, గ్రామస్తులు మఠం మచ్చన్న పడాల్, మట్ట పురుషోత్తం పడాల్, పాల్గున్న పడాల్, విశ్వనాథం పడాల్, వి మన్మధరావు, ఎం బోడయ్య పడాల్ కోరారు. గ్రామ సభల్లో, స్పందన కార్యక్రమంలో అనేక దఫాలు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదని బుధవారం పాత్రికేయులకు తెలిపారు. వార్డు మెంబర్ మఠం రాజేశ్వరి తెలిపిన వివరాల ప్రకారం గుడ్డమెట్ట గ్రామంలో సుమారు 28 కుటుంబాలు 132 మంది జనాభా కలిగి నివసిస్తున్నారు. గ్రామంలో సిసి రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిసి రోడ్డు మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

బీహార్‌లో స్పీకర్ పర్యటన

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: బీహార్ రాష్ట్రంలోని ప్రసిద్ధ బోధ్ గయా ప్రాంతాన్ని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి, ఉప స్పీకర్ కె. రఘురామకృష్ణరాజు కుటుంబం సందర్శించారు. ప్రపంచ ప్రసిద్ధ మహాబోధి ఆలయం ప్రాంగణంలో పర్యటించి పూజలు చేశారు. బుద్ధుడు బోధి వృక్షం కింద ధ్యానం చేశారు.

ఎఒబిలో పోలీసుల అప్రమత్తత

- భారీ ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులకు ఎదురు దెబ్బ
- ప్రతీకార చర్యకు దిగుతారని ఇంటిలిజెన్స్ వర్గాల సమాచారం
- కేంద్ర బలగాలతో ముమ్మరంగా గాలింపు

ప్రజాశక్తి-సీలేరు

చతీస్‌ఘడ్ సరిహద్దుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ అగ్రనేత రామచంద్రారెడ్డి అలియాస్ చలపతితో పాటు 26 మంది మావోయిస్టులు మృతి చెందిన నేపథ్యంలో ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. గట్టి ఎదురు దెబ్బలు తిన్న మవోయిస్టులు భారీ విధ్వంసాలకు పాల్పడతారని, పోలీసుల లక్ష్యంగా గ్రానైట్లు, డిటైనేటర్లతో మావోయిస్టులు దాడులకు తెగబడతారనినిఘా వర్గాలు హెచ్చరికలు జారీ చేశాయి. దీంతో ఎఒబిలో పోలీసులు హై అలర్ట్ అయ్యారు. వందల సంఖ్యలో కేంద్ర పోలీసు బలగాలను రంగాల్లో దింపి అణువణువు గాలింపు చర్యలు చేపడుతున్నారు. చత్తీస్‌ఘడ్, ఒడిశా, తెలంగాణా, ఎపి సరిహద్దుల్లో మావోయిస్టు కదిలికలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి సరిహద్దు అటవీ ప్రాంతాన్ని బుధవారం జల్లెడ పట్టారు. సరిహద్దు అవుట్ పోస్టులకు భద్రత పెంచారు.

నెల రోజుల్లో సుమారు 40 మంది మావోయిస్టులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడంతో మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలిందని చెప్పక తప్పదు. 2024లో సుమారు 100 మందికి పైగా మావోయిస్టులను హతమార్చిన పోలీసులు 2025లో నెలరోజులు వ్యవధిలో మరో 40 మందిని పోలీసులు హతమార్చి పైచేయి సాధించారు. ఈ నేపథ్యంలో సరిహద్దుల్లో తీవ్రత ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. మావోయిస్టు హిట్ లిస్టులో ఉన్న పోలీస్ స్టేషన్‌లకు సిఆర్పిఎఫ్ స్పెషల్ పార్టీ బలగాలతో భద్రత కట్టు దిట్టం చేశారు. మావోయిస్టు సానుభూతిపరులు కదలికలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.

మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు అగ్రనేత చలపతి 1998లో ఈస్ట్ డివిజన్ కమిటీ కార్యదర్శిగా ఉండేవారు. మల్కనగిరి జిల్లా చిత్రకొండ పోలీస్ స్టేషన్ పరిధి బలిమెల రిజర్వాయర్‌లో 2008లో లాంచ్‌పై ప్రయాణిస్తున్న గ్రేహౌండ్స్ బలగాలపై దాడి చేసి 38 మందిని హతమార్చిన ఘటనలో చలపతి కీలకపాత్ర పోషించారు. మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ వినీల కృష్ణ కిడ్నాప్ వ్యవహారంలోనూ కీలక సూత్రధారిగా ఉన్నారు.



ఎఒబి సరిహద్దు అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా రాసే పత్రిక ప్రజాశక్తి

ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రజా సమస్యలపై నిక్కచ్చిగా వార్తలు రాస్తూ ప్రజల మన్ననలను పొందుతున్న పత్రిక ప్రజాశక్తి దినపత్రిక అని విఆర్ పురం ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం .జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు అన్నారు. ప్రజాశక్తి 2025 కేలండర్‌ను గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మి, రాజులు మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంతో ప్రజాశక్తి దినపత్రిక విజయవంతంగా ప్రజల గొంతుకును వినిపిస్తుందని చెప్పారు. విలువలతో కూడిన వార్తలతో సమాజానికి దిశా నిర్దేశం చేస్తుందన్నారు. ప్రజాశక్తి కేలండర్‌లో వేస్తున్న సీనరీలు, డిజైన్లు చాలా అందంగా, చూడ ముచ్చటగా ఉంటాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల నాయకులు పోడియం శ్రీరామ్మూర్తి, కారం సుందరయ్య, కారం సత్తిబాబు, జి.లక్ష్మణరావు, ప్రజాశక్తి రిపోర్టర్ లక్ష్మణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నేతలు రాజులు, ఇతర నాయకులు


గిరిజనులతో మాట్లాడుతున్న సాధన

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి-హుకుంపేట: క్షయ నిర్మూలనకి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాధన పేర్కొన్నారు. మండలంలోని హుకుంపేట, ఉప్ప ఆరోగ్య కేంద్రాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంతరి పంచాయితీ లో క్యాన్సర్, టీబీ వ్యాక్సినేషన్ కోసం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీసీ -జీ వ్యాక్సినేషన్ పై అవగాహన కల్పించాలన్నారు. వ్యాక్సినేషన్ వేసుకోవడంతో టీబీ వ్యాధిని అరికట్టగలమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికాలు మోహన్, కిషోర్, సర్పంచ్ అప్పలనాయుడు, టీబీ కోఆర్డినేటర్ శేషగిరి వెంకటేశ్వర్లు, టీబీ సూపర్వైజర్ కె .సదానందం, ఫీల్డ్ కోఆర్డినేటర్ ఎం.ధనరాజు , తదితరులు పాల్గొన్నారు.

జెఎల్‌సి ఆదేశాలను సెవెన్ హిల్స్ అమలుచేయాలి


కార్మిక, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జాయింట్ లేబర్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను ఎంజిఎం సెవెన్ హిల్స్ హాస్పిటల్ యాజమాన్యం అమలు చేయాలని, 38 మంది కార్మికులకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కార్మిక, ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్‌చేసింది. టి.నూకరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విశాఖ జిల్లా హాస్పటల్, నర్సింగ్ హోమ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వై.రాజు మాట్లాడుతూ, ఎంజిఎం సెవెన్ హిల్స్ ఆసుపత్రి యాజమాన్యం గత రెండేళ్లుగా కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, కార్మికుల బతుకులతో ఆటలాడుతుందన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి 38 మంది కార్మికులను చట్ట విరుద్ధంగా ఉద్యోగాల నుంచి తొలగించిందన్నారు. పండగ పూట వారంతా పస్తులతో గడపవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. గత రెండేళ్లుగా కార్మికులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ యాజమాన్యం సమస్యను పరిష్కరించకుండా, దున్నపోతు మీద వర్షం కురిసిన చందంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. యాజమాన్యం చట్ట వ్యతిరేక చర్యలను అరికట్టి 38 మంది కార్మికులకు జీతాలు ఇప్పించాలని జాయింట్ లేబర్ కమిషనర్‌కు యూనియన్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జాయింట్ లేబర్ కమిషనర్ స్పందించి కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని రెండుసార్లు నోటీసు ఇచ్చినప్పటికీ యాజమాన్యం ఇంతవరకు ఆదేశాలను అమలు చేయలేదన్నారు 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులు యూనియన్‌గా ఏర్పడి ఆందోళన చేస్తుంటే, యూనియన్‌ను విచ్ఛిన్నం చేయడానికి కార్మికులను ఉద్యోగాల నుంచి హాస్పటల్ యాజమాన్యం తొలగించి వారి బతుకులతో ఆటలాడుకుంటుందని చెప్పారు. కార్మికులకు చట్టపరంగా రావలసిన బెనిఫిట్స్ ఎగ్గొట్టడానికి రికార్డులను తగలబెట్టి, అగ్ని ప్రమాదం జరిగిందని నాటకం ఆడుతోందన్నారు. 900 మంది ఉన్నప్పుడు కార్మికులను తొలగించాలంటే ప్రభుత్వం వద్ద అనుమతి పొందాలన్నారు. కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. అలా కాకుండా యాజమాన్యం ఏకపక్షంగా కార్మికులను దశలవారీగా బయటికి పంపాలని కుట్ర పన్నుతోందని తెలిపారు. కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఆకలి బాధలకు గురిచేసి వారిని లొంగదీసుకోవాలని చూస్తోందని విమర్శించారు. కార్మికులు ఐక్యంగా ఉంటూ యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారని చెప్పారు.

సిఐటియు జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి మాట్లాడుతూ, సెవెన్ హిల్స్ హాస్పిటల్ భారత న్యాయ చట్టాలను అమలు చేయాలని, లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కృష్ణ మోహన్ మాట్లాడుతూ ఈ నెల 24న సిఐటియు, ఇతర కార్మిక సంఘాల నాయకులతో కలిసి యాజమాన్యం వద్దకు వెళ్లి న్యాయంగా కార్మిక చట్టాలను అమలు పరచాలని కోరుదామని చెప్పారు. ఆయన సూచన మేరకు సమావేశం తీర్మానం ఆమోదించింది. స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు రమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.నర్సింగరావు, మత్స్యకారుల సంఘం నాయకులు కె.చంద్రశేఖర్, ఆటో యూనియన్ నాయకులు అప్పలరాజు, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు యు.రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' ద్వారా రహదారుల నిర్మాణంలో విఫలం

ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: గిరిజన ప్రాంతంలో కనీసం చాలా గ్రామాలకు వెళ్లేందుకు రహదారి సౌకర్యం కూడా లేని పరిస్థితులు అత్యధికంగా ఉన్న ఆ సమస్యల పరిష్కారం దిశగా ఆయా గ్రామ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఎందుకు దృష్టి సారించడం లేదని, ఆ సమస్యలను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పరిష్కరించేందుకు ఎందుకు చొరవ చూపలేక పోతున్నారని ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం ప్రశ్నించారు. అరకులోయలోని బుధవారం జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో ఇప్పటికీ రహదారి సౌకర్యం లేక అత్యవసర పరిస్థితుల్లో హాస్పిటల్‌కి వచ్చే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బంది పడుతున్న గ్రామాలు అనేకమున్నాయి. అయినా ఆ సమస్యలను అధిగమించేందుకు ప్రజాప్రతినిధులు ఎందుకు చొరవ చూపడం లేదన్నారు. ప్రతి గ్రామానికి ఉపాధి హామీ పథకంలో రహదారులు వేసుకునేందుకు అవకాశం ఉన్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆ దిశగా ఎందుకు అడుగులు వేయడంలో వైఫల్యం చెందుతున్నారని ఆయన ప్రశ్నించారు. భూముల అభివృద్ధి, పండ్ల తోటలు, చెరువులు వంటి వాటికి ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకుంటున్న తరుణంలో రహదారులు లేని గ్రామాలకు కూడా నిర్మించుకునే అవకాశం ఈ పథకంలో ఉన్నప్పుడు ఇంకా డోలీమోతల సమస్య ఎందుకు ఉత్పన్నమవుతుందని ఆయన అన్నారు. పాడి హామీ పథకం ద్వారా రహదారి నిర్మాణానికి ఎందుకు ఇప్పటి వరకు చొరవ చూపడంలో వైఫల్యం చెందారో తెలియజేయాలని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎన్ఆర్ఇజిఎస్ అనేది ఒక గొప్ప పథకంగా పేర్కొన్నారు. అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉన్నప్పుడే దాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రహదారి సౌకర్యం ఏర్పడినప్పుడే ఆ గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం నుండి సహకారం లభించే అవకాశం ఉంటుందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి స్థానికంగా ఉన్న మనమంతా కూడా దృష్టి సారించవలసిన అవసరంతోనే అభివృద్ధిలో వెనుకబడి పోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రంజపల్లి ఉషారాణి , పద్మాపురం సర్పంచ్ సుషీల, వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, జడ్పిటిసి శెట్టి రోషిని, డిపిఒ నిర్మలాదేవి, పిడి విద్యాసాగర్,సర్పంచులు, ఎంపీటీసీలు, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది,ట్రైబల్ ఎఇ , పంచాయతీ రాజ్ ఎఇ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో విశాఖ ఉక్కుకు రక్షణ

జిసిసి రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: కూటమి ప్రభుత్వంతోనే విశాఖ ఉక్కుకు రక్షణ కలుగుతుందని గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ వెల్లడించారు. పాడేరులోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ, తెలుగు వారు వీరోచిత పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసి సంపాదించుకున్న విశాఖ ఉక్కును గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యంతో అప్పులలోకి కూరుకు పోయిందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం రెండు విడతల్లో రూ1,650కోట్లు సాయం చేసిందని చెప్పారు. నష్టాలలో ఉన్న స్టీల్ ప్లాంట్ ను పట్టించుకొని అన్ని రకాలుగా ఆదుకునే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బాకురు సర్పంచ్ వెంకట రమణ రాజు, స్టేట్ ఎస్టీ సెల్ కార్యదర్శి సాగర సుబ్బారావు, దారేల సర్పంచ్ పాండు రంగ స్వామి, జన సేన మండల అధ్యక్షుడు కోటేశ్వర పడాల్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు రాజు కుమార్, నాయకులు గంగరాజు, మురళి స్వామి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిడారి శ్రావణ్‌కుమార్


శ్మశానాన్ని పరిశీలిస్తున్న ఎపిఒ రాజు తదితరులు

రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు

ప్రజాశక్తి - చింతపల్లి : స్థానిక హిందూ శ్మశాన వాటికకు మట్టి రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, త్వరలోనే ఆ పనులు ప్రారంభిస్తామని స్థానిక మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ సర్వ సభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి లేవనెత్తిన ఈ సమస్యపై స్పందించిన ఏపీఓ రాజు వైకాపా అల్లూరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పిందాల అప్పారావుతో కలిసి స్థానిక శ్మశాన వాటికను సందర్శించారు. ఉపాధి హామీ పథకం ద్వారా సుమారు కిలో మీటరు రహదారికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. అనంతరం ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి మాట్లాడుతూ, శ్మశాన వాటికకు రక్షణ గోడ లేకపోవడంతో కబ్జాకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమరాజు, దారబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ జిల్లా గాజువాక నియోజకవర్గ పరిధి అగనంపూడి జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. గాజువాక నుంచి అగనంపూడి వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మన్మధరావు (41), అరుణకుమారి (34)ని భారీ ట్రాలర్ ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలిద్దరూ ట్రాలర్ వెనుక చక్రాల కింద పడి నలిగిపోయి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌ను నియత్రించి మృతదేహాలను కెజిహెచ్‌కు తరలించారు. మన్మధరావు ఫార్మాసిటీలో ఉద్యోగం చేస్తున్నాడు. బ్యాంకు పని నిమిత్తం గాజువాక వెళ్లి తిరిగి అగనంపూడి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అగనంపూడి పరిధి డొంకాడలో వీరు అద్దెకు ఉంటున్నారు.

విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసం

ఐదుగురిని విశాఖకు తీసుకొచ్చిన సిపి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విదేశాల్లో ఉద్యోగాలకు వెళ్లి మోసపోయిన ఐదుగురిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ సహకారంతో విశాఖపట్నం తీసుకొచ్చినట్లు నగర పోలీస్ కమిషనర్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. షార్జాకు ఉద్యోగాల కోసం వెళ్లి అక్కడ మోసపోయిన ఉత్తరాంధ్ర యువకుడు నగర పోలీస్ కమిషనర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించడంతో అప్రమత్తమైన పోలీసులు ఐదుగురు బాధితులను కేంద్ర విదేశాంగ శాఖ సహకారంతో విశాఖ తీసుకువచ్చారు. వారికి బుధవారం మధ్యాహ్నం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాకు చెందిన పోలుపర్తి లక్ష్మీనారాయణ (21), గార రాజేష్ (21) పైల రామస్వామి (21), శ్రీకాకుళం జిల్లాకు చెందిన కాళ్ల వెంకట్రావు(25), విశాఖపట్నం జిల్లాకు చెందిన గెద్దాడ లోకేష్ (24) సంవత్సరం క్రితం గాజువాక శ్రీనగర్ ప్రాంతంలో ఉన్న విశాఖ వెల్డింగ్ ఇనిస్టిట్యూట్‌లో వెల్డింగ్ పనులు చేయడంలో శిక్షణ తీసుకున్నారని తెలిపారు. 2024 అక్టోబర్ నెలలో దుర్గారావు అలియాస్ ప్రసాద్, చందు ఏజెంట్ల ద్వారా మణికంట వెల్డింగ్ ఇనిస్టిట్యూట్ ఆటోనగర్ నుంచి దుబాయ్‌లోని షార్జా ప్రాంతంలో క్వాలిటీ ఇంటర్నేషనల్ కంపెనీలో పనిచేయడానికి ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. ఇంటర్వ్యూలు, వైద్య పరీక్షలు పూర్తయిన తర్వాత 2024 నవంబర్ 12న దుబాయ్ వెళ్లి షార్జాలో ఆ కంపెనీలో చేర్పించారని వివరించారు. అయితే ఏజెంట్లు ఆఫర్ చేసిన విధంగా వారికి ఉద్యోగం ఇవ్వకుండా వారిని బంధించడంతో విశాఖపట్నం జిల్లాకు చెందిన లోకేష్ తనను సంప్రదించాడని సిపి వివరించారు. వెంటనే తాను ఇమిగ్రేషన్ అధికారులతో చర్చించి వారికి విమాన టికెట్లు ఏర్పాటుచేసి బుధవారం దుబాయ్ నుంచి విశాఖపట్నం సురక్షితంగా తీసుకొచ్చినట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేదు

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఎమ్మెల్సీ, వైసిపి మహిళా విభాగం అధ్యక్షులు వరుదు కల్యాణి ఆందోళన వ్యక్తం చేశారు. మద్దిలపాలెంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ భీమిలిలో ఇద్దరు బాలికలపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హోంమంత్రి సొంత జిల్లాలోనే మహిళకు భద్రత లేదన్నారు. మహిళలపై ఇటీవల జరిగిన దాడుల్లో 80 శాతం మద్యం మత్తులోనివేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో 50వేలకు పైగా బెల్ట్‌షాప్‌లు నడుస్తున్నాయని, హోం మంత్రి సొంత జిల్లా అనకాపల్లిలో విచ్చలవిడిగా గంజాయి లభిస్తుందని ఆరోపించారు. ముఖ్యమంత్రి నివాసముంటున్న గుంటూరు జిల్లాలోనే కొకైన్ లభించిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మహిళల భద్రత ఎలా అని ఆమె ప్రశ్నించారు.

అంబేద్కర్ -పూలే కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : మనభూమి దినపత్రిక ప్రచురించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్- పూలే కేలండర్-2025ను విఎంఆర్‌డిఎ చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఆవిష్కరించారు. సిరిపురంలోని విఎంఆర్‌డిఎ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ, అంబేద్కర్, పూలే, సావిత్రి బాయ్ పూలే కృషి ఫలితంగా సమాజం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు.


సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ పూనెం సరోజిని

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి గ్రామపంచాయతీ పరిధి ఉమ్మడివరం రెడ్డిగుంపులో రూ.6 లక్షల వ్యయంతో సిసి రోడ్డు నిర్మాణానికి బుధవారం స్థానిక సర్పంచ్ పూనెం సరోజిని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండరెడ్డి గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కింద వచ్చిన గ్రాంట్ ద్వారా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ పాయం లక్ష్మణరావు, సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల కార్యవర్గ సభ్యులు పోడియం శ్రీరామ్మూర్తి, నాయకులు తాతబాబు రెడ్డి, వేటగాని సూరిబాబు, నాల్లరపు ప్రకాష్ రావు, సారా పాండు రాజు, సీనియర్ నాయకులు వీర్ల నాగేశ్వరరావు, తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు బీరక సూర్యప్రకాశరావు, చిక్కాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై నమ్మకం కలిగింది

హంగేరి, స్వీడన్ వాసుల వెల్లడి


జమాల్ ఖాన్ ఆయుర్వేద వైద్య శాలను సందర్శించిన హంగేరి, స్వీడన్ వాసులు

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : ఆయుర్వేద వైద్యం పట్ల తమకు పూర్తి నమ్మకం కలిగిందని హంగేరి దేశానికి చెందిన మౌనిక, స్వీడన్‌కు చెందిన అనన్య పేర్కొన్నారు. మండలంలోని నిమ్మలగూడెంలో ఉన్న జమాల్ ఖాన్ ఆయుర్వేద వైద్యశాలకు బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాక్ పెయిన్ ఇతర సమస్యలకు జమాల్ ఖాన్ ఆయుర్వేద వైద్యశాల నుండి మందులు కొరియర్ ద్వారా తెప్పించుకొని వాడామని, రోగం నయం అవడంతో మళ్లీ బుధవారం రాజమండ్రి నుండి తమకు తెలిసిన తెలుగువారితో వైద్యశాలకు విచ్చేశామని చెప్పారు. వనమూలికలతో తయారైన మందులు ఎంతగానో పని చేశాయని, ఆయుర్వేద వైద్యంతో అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులను నయం అయ్యే అవకాశం ఉందని తెలుస్తోందని పేర్కొన్నారు. ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్‌ను కలవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు.

రాష్ట్రస్థాయి హిందీ పరీక్షలో ప్రతిభ

ప్రజాశక్తి పద్మనాభం : రాష్ట్రస్థాయి హిందీ ప్రతిభ పరీక్షల్లో మండలంలోని కృష్ణాపురం కెజిబివి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ గ్రేసీ లిల్లీ అన్నారు. కృష్ణాపురం కస్తూర్బా పాఠశాల హిందీ టీచర్ ఎన్.కోమలి సహకారంతో వీరంతా మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మెరిట్ సర్టిఫికేట్‌లతో పాటు ఐదు బంగారు, ఏడు వెండి పతకాలను సాధించారన్నారు. డిఇఒ ఎన్.ప్రేమకుమార్, ఎపిసి జె.చంద్రశేఖర్, జిసిడిఒ ఖలీసా బేగం తమ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

పుస్తక పఠనంతో ప్రయోజనం

ప్రజాశక్తి -మధురవాడ : సాంకేతికంగా ఎంత పురోభివృద్ధి సాధించినా, పుస్తకానికున్న ప్రాధ్యాన్యత సుస్థిరమని, విద్యార్థి దశలో పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవడం వారిని ఉన్నత శిఖరాలకు తీసుకువెళుతుందని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ అన్నారు. బుధవారం గీతం నాలెడ్జి రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు ఈ సందర్భంగా విద్యార్థులలో పఠనాసక్తిని పెంచడానికి పుస్తక ప్రదర్శన దోహదపడుతుందన్నారు. గీతం గ్రంథాలయ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌పిఎ. బాలసుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులకు ఉపయోగపడేలా దేశంలోని ప్రముఖ ప్రచురణకర్తలతో రెండురోజుల పాటు పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోందని, ఇకపై ఏటా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు.

పుస్తక ప్రదర్శనలో ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్, కంప్యూటర్ సైన్స్, మేనేజ్‌మెంట్, వైద్య రంగాలకు చెందిన గ్రంథాలను అందుబాటులో ఉంచారు. తాము చదువుతున్న కోర్సులలో నూతన అంశాలపై గ్రంథాలను సహితం పుస్తక ప్రదర్శనలో అందుబాటులో ఉంచడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. గీతం గ్రంథాలయ అధికారి డాక్టర్ శివ ప్రసాద్ పండా ఇతర అధికారులు పాల్గొన్నారు.


గీతంలో పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు

పద్మనాభరావు మరణం తీరనిలోటు

కుటుంబ సభ్యులను పరామర్శించిన సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు


పద్మనాభరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి-పెందుర్తి : షిప్‌యార్డ్ మాజీ ఉద్యోగి, సిపిఎం సభ్యులు వనమాలి పద్మనాభరావు మరణం ఆయన కుటుంబానికే కాక కష్టజీవుల ఉద్యమానికి తీరనిలోటని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు అన్నారు. మంగళవారం పద్మనాభరావు మృతి చెందారు. బుధవారం పెందుర్తి చిన ముషిడివాడ శ్రమశక్తినగర్‌లోని పద్మనాభరావు కుటుంబాన్ని జగ్గునాయుడు పరామర్శించారు. పద్మనాభరావు లక్ష్మి దంపతుల కుమార్తెలు విశాలి, విజయ, కుమారుడు శ్రీనివాసరావు, సోదరుడు సూర్యారావులను పరామర్శించిన జగ్గునాయుడు, పద్మనాభరావు, లక్ష్మిలు ప్రజా ఉద్యమంలో చేసిన కృషిని, అతనితో తమకున్న అనుబంధాన్ని కుటుంబ సభ్యులతో జగ్గు నాయుడు పంచుకున్నారు. పార్టీ విశాఖ జిల్లా కమిటీ తరపున తమ సంతాపాన్ని సానుభూతిని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఎరక్షన్ డిపార్ట్మెంట్లో ఎరక్టర్‌గా, షిప్‌యార్డ్ ట్రైనింగ్ స్కూల్లో ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహించిన పద్మనాభరావు, . మాస్టర్‌గా గుర్తింపు పొందారు. సిపిఎం సభ్యునిగా, సిఐటియు నాయకునిగా షిప్‌యార్డులోనూ, మల్కాపురం జోన్ పరిధిలోను సేవలందించారు. సౌమ్యులు, నీతి నిజాయితీ నిబద్ధతగల పద్మనాభరావు పలువురికి ఆదర్శంగా నిలిచారు. తనతోపాటు తన భార్య లక్ష్మిని కూడా ఉద్యమంలో భాగస్వాములను చేశారు. 50వ వార్డు కార్పొరేటర్‌గా సిపిఎం తరపున పోటీ చేసిన లక్ష్మి, మహిళా సంఘం మల్కాపురం జోన్ నాయకురాలిగా వ్యవహరించారు.

ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో పిల్లలకు ప్రత్యేక వార్డు

ప్రజాశక్తి- సీతమ్మధార : రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలతో నగరంలోని రెడ్నం సూర్య ప్రసాదరావు ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఒపి చీటీలు రాసే కేంద్రం, వైద్యపరీక్షల గది, ఆరు బెడ్‌లతో పిల్లల ప్రత్యేక వార్డును బుధవారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు నేతృత్వంలో బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా అన్ని జిల్లాల ప్రధాన ఆసుపత్రుల్లో ప్రత్యేక ఒపిలు, ప్రత్యేక వార్డులు నెలకొల్పాలన్నది లక్ష్యమని, అందులో భాగంగానే గతనెలలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సూచనల మేరకు ప్రాంతీయ నేత్రవైద్యశాలలో పిల్లలకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మిగతా ఆసుపత్రులతోపాటు అన్ని జిల్లాల్లోనూ బాలలకు ప్రత్యేక వైద్యవిభాగాలను ఏర్పాటుకు కమిషన్ కృషి చేస్తుందన్నారు. నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాటుచేసిన ప్రత్యేక వార్డులో వైద్యసేవలను, మరిన్ని మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా నుంచి వచ్చే పిల్లలకు మెరుగైన నేత్ర వైద్యసేవలు అందించేందుకు వీలుంటుందన్నారు .కార్యక్రమంలో ఆసుపత్రి పిఎంఒ ఒ..ఉమా శ్రీనివాస్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణ కుమారి, జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రతినిధులు, చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం జిల్లా ప్రతినిధులు కె.ఎల్లయ్య, ఎం.హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : మండల కేంద్రంలో సోమవారం జరిగిన అగ్నిప్రమాదంలో తాటాకుళ్ళు దగ్ధమై నిరాశ్రయులైన మాణిక్యం కుటుంబానికి ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఆదేశాల మేరకు టిడిపి నేత వీరా బాలయోగి, భార్య వెంకటలక్ష్మి చేతుల మీదుగా బుధవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. స్థానిక తహశీల్దార్ సూర్యారావు చేతుల మీదగా కాయకూరలు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దారు సూర్యారావు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో పూర్తిగా ఇల్లు, సామాన్లు కాలి బూడిదై నిరాశ్రయులైన వారికి ప్రభుత్వం నుండి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం ద్వారా కాలనీ వచ్చే విధంగా సహకరిస్తామని చెప్పారు. టిడిపి నేత బాలయోగి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన పార్టీల నాయకులు జయరాం తదితరులు పాల్గొన్నారు.

80 మంది గీతం ఎంబిఎ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రాంగణ నియామకాలలో గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ విద్యార్థులు 80 మంది ప్రముఖ కార్పొరేట్ సంస్థలలో భారీ వేతనంతో ఉద్యోగాలను సాధించారు. పలువురికి రూ.11 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు వచ్చాయని గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ వంశీకిరణ్ సోమయాజుల తెలిపారు డెలాయిట్, రిలయన్స్ బిపి మొబిలిటి లిమిటెడ్, బెర్కాడియా బిఎస్ఎమ్ సొల్యూషన్స్, ఎక్సెంచూర్, విప్రో, బజాజ్ ఎలక్ట్రికల్స్, టివిఎస్ మోటార్స్, ఒరాకిల్, ఎడిపి, ప్రైస్ వాటర్ కూపర్, కాల్గేట్ పామోలివ్, గ్రాసిమ్ వంటి . ప్రముఖ సంస్థలు ప్రాంగణ నియామకాలను నిర్వహించాయన్నారు. తెలిపారు. రానున్న రోజులలో మరికొన్ని కార్పొరేట్ కంపెనీలు ప్రాంగణ నియామకాలను జరపనున్నాయన్నారు.

విద్యార్థులకు ప్రణాళికయుతంగా శిక్షణ ఇవ్వడం, కార్పొరేట్ రంగం నిపుణులతో చర్చా కార్యక్రమాలు నిర్వహించడం ప్రాంగణ నియామకాలలో విద్యార్థులు విజయానికి దోహదపడ్డాయని గీతం కెరీర్ ఫుల్‌ఫిల్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.వి.సంధ్యారాణి తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా.పి.పప్పు అభినందించారు.

ప్రజాభాగస్వామ్యంతో చెరువుల పరిరక్షణ

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : చెరువుల పరిరక్షణ అందరి బాధ్యత అని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు బుధవారం జివిఎంసి నాలుగో వార్డు కాపులుప్పాడలో ధాన్ ఫౌండేషన్, విఎంఆర్‌డిఎ, జివిఎంసి సంయుక్త ఆధ్వర్యంలో సిఎఎస్‌సిఎడి పథకం ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్యే గంటా మాట్లాడారు. పెరుగుతున్న పట్టణీకరణ ప్రభావంతో అనేక చెరువులు కనుమరుగవుతున్నాయన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు ప్రజల భాగస్వామ్యంతో చెరువు గర్భాలను రక్షించుకోవడం సాధ్యమవుతుందన్నారు. పునరుజ్జీవంతో పాటు చెరువు సుందరీకరణ ద్వారా కాపులుప్పాడ చెరువును ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు, విశాఖ ఎంపి ఎం.శ్రీభరత్, కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్, విఎంఆర్‌డిఎ చైర్మన్ కెఎస్.విశ్వనాథన్, ఆయిల్ సీడ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జీతో కలిసి కాపులుప్పాడ చెరువును ఎమ్మెల్యే గంటా పరిశీలించారు.